సమస్యలు తెలుసుకునేందుకే బస్తీ పర్యటన


గుడిమల్కాపూర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే బస్తీ పర్యటనలు చేపట్టామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో నాయకులతో కలిసి శనివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వర్షం పడితే వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయని, నల్లాల్లో రంగు మారిన నీరు వస్తుందని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ నల్లాల్లో కలుషిత నీరు రావడంపై ఇప్పటికే జలమండలి జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. అదేవిధంగా మిగితా సమస్యలు కూడా సాధ్యమైన త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట నాయకులు అశ్విన్, శ్రీకాంత్, సాగర్ తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ సభ


రాష్ట్ర అధ్యక్షుడు కలిముద్దీన్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్యారోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలిముద్దీన్ అహ్మద్ పదవీ విరమణ సభను కోఠి డీఎస్ఈ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ఆయనను శాలువా, మెమెంటోలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా గన్‌పార్కులో ఉద్యోగ సంఘాల జాక్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్, కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, నగరశాఖ అధ్యక్షుడు గండూరి వెంకట్, హెచ్‌వస్ యూనియన్ అధ్యక్షుడు కార్నటి సాయిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్ఎస్ యూనిట్ అధ్యక్షుడు ప్రభాకర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మధుకుమార్ సేవలు అభినందనీయం

సిటీ కోర్టులు : వినియోగదారుల కమిషన్‌కు మధుకుమార్ అందించిన సేవలు అభినందనీయమని ఆయా కమిషన్ అధ్యక్షులు, సభ్యులు పేర్కొన్నారు. హైదరాబాద్ వినియోగదారుల కమిషన్–1 సూపరింటెండెంట్ కె.మధుకుమార్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి మధుకుమార్ సతీమణి మహబూబ్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా, వినియోగదారుల స్టేట్ కమిషన్ ఇన్‌చార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్, సభ్యులు ఆర్‌యస్ రాజేశ్రీ, వీవీ శేషుబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆయా కమిషన్ అధ్యక్షులు, సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా జిల్లా కమిషన్ అధ్యక్షులు వక్కంటి నరసింహరావు, సీహెచ్ లతాకుమారి, రాంగోపాల్‌రెడ్డి, ఉమా సుబ్బలక్ష్మి, సభ్యులు జవహర్‌బాబు, జనార్దన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీదేవి, శ్యామల మాధవీలత, మాధవి, స్టేట్ కమిషన్ రిజిస్ట్రార్ రామ్‌కుమార్, రాజిరెడ్డి, తిరుమలరావు, ప్రవీణ్, వై.శ్రీనివాస్, ఫణీకుమార్, రాజేశ్ పాల్గొన్నారు.


సూపరింటెండెంట్ దంపతులను సన్మానిస్తున్న వినియోగదారుల కమిషన్ సభ్యులు

‘ది స్టోరీ ఆఫ్ బెంగాల్ చిత్రాన్ని చూడండి’


ఎమ్మెల్యే రాజాసింగ్‌తో నిర్మాత జితేందర్ నారాయణ్ సింగ్

జియాగూడ: వెస్ట్‌బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ‘ది స్టోరీ ఆఫ్ బెంగాల్’ చిత్రంలో స్పష్టంగా చూపించారని ప్రతిఒక్కరూ తప్పకుండా చూడాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. సినిమా ప్రమోషన్‌ను పురస్కరించుకొని యూనిట్ సభ్యులు ఎమ్మెల్యే రాజాసింగ్‌ను శనివారం కలిసి సన్మానించారు. అనంతరం సినిమా ప్రొడ్యూసర్ జితేందర్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. హిందువులపై రోహింగ్య శరణార్థులు, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడుతున్నావారు, లవ్ జిహాద్‌పై సినిమాను నిర్మించామని, ఈ రోజు దేశమంతా విడుదల చేశామన్నారు. ప్రతి హిందువులపై జరుగుతున్న ఆగడాలు, అరాచకాలు ఇందులో చూపించామని పేర్కొన్నారు.

ఉస్మానియా ఆసుపత్రి పనులను అడ్డుకుంటాం


ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు

అబిడ్స్: గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో నూతనంగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మిస్తే అడ్డుకుంటామని గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు వినోద్ యాదవ్, కోటి శైలేష్ కురుమలు పేర్కొన్నారు. స్థానికులతో కలిసి గోషామహల్‌లో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోషామహల్ పరిసరాల్లో లక్షలాది మంది జీవిస్తారని ఆసుపత్రి నిర్మిస్తే అందులోని మార్చురీతో వేలాది కుటుంబాలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని విరమించుకుని ప్రస్తుతం ఉన్న అఫ్జల్‌గంజ్‌లోనే పాతభవనాలను తొలగించి కొత్త భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు.

శ్రీ మేధావి జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే హంగామా


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గోల్కొండ: శ్రీ మేధావి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా విద్యా రంగంలో ఉన్నామని, ఎందరో ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పూర్ణచందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా నాలాలు..!

- ఇబ్బందుల్లో వాహనదారులు, స్థానికులు
- పట్టని అధికారులు


గెలాక్సీ-టూబ్స్ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

గోల్కొండ: నాలాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంతో రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయి. అంతేగాకుండా వాటిలో కొన్ని నాలాలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. హకీంపేట్ కుంటలోని బుల్కాపూర్ నాలా, టోలిచౌకీ-టూబ్స్ రోడ్డులోని నాలాలు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. టోలీచౌకీ-టూబ్స్ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గెలాక్సీ నుంచి టూబ్స్ రోడ్డుపై ఉన్న ఈ నాలా దశాబ్ద కాలంగా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- చిన్నపాటి వర్షానికే నాలా నీరు రోడ్డుపైకి చేరుతుంది.
- దీంతో గెలాక్సీ సెంటర్ నుంచి టూబ్స్ రోడ్డుపై వెళ్లే వారు షేక్‌పేట్ నాలా, టోలీచౌకీ వైపు నుంచి టూబ్స్ చౌరస్తాకు వెళ్తున్నారు.
- నాలాలో కూలిన గోడలను తొలగించక పోవడంతో అలాగే పేరుకుపోయాయి.
- నాలా దుస్థితిని చూసి పరిసర ప్రాంతాల వారు కూడా నాలా వద్ద చెత్త డంపింగ్ చేస్తున్నారు.
- నాలా చుట్టు వ్యర్థాలు చేరి దుర్వాసన వ్యాప్తుండడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి.
- హకీంపేట్ విరాట్‌నగర్ నాలా మురికి కుంటగా మారింది.
- వ్యర్థాలు బాగా చేరడంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు.
- పలు చోట్ల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.
- రెస్టారెంట్ల వారు, కూరగాయల వ్యాపారులు వ్యర్థాలను తెచ్చి ఆటో ట్రాలీలతో నాలాలో డంపింగ్ చేస్తున్నారు.
- బుల్కాపూర్ నాలాకు యేటా జరిగే పూడికతీత పనులు ప్రహసనంగా మారుతున్నాయి.
- ప్రస్తుతం ప్రభుత్వం చెరువుల కబ్జాలపై దృష్టిపెట్టింది.
- అయితే నాలాల నిర్వహణ సైతం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మనసున మనసై ఫేస్‌బుక్ సమూహపు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి పద్మా దాశరథి రచించిన సహచర్య బంధం, పద్మా దాశరథి రచనలు పుస్తకాలను శనివారం రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సినీ నటుడు ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో సహచరుల మధ్య ఉండే ప్రేమా ఆప్యాయతలను, మనసుచెప్పిన ముచ్చట్లు పేరిట రచనలు ఎంతో చక్కగా వివరించారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత సిండికేట్ బ్యాంక్ మేనేజర్ ఎం.సుబ్బారావు, రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి, జొన్నలగడ్డ కనక దుర్గ, ఎన్.సుందరీనాగమణి పాల్గొన్నారు.

రూ.35 లక్షల బ్యాగు అపహరణ

అబిడ్స్: రూ.35 లక్షల బ్యాగ్‌ను గుర్తు తెలియని ఇద్దరు దుండగులు లాక్కొని పరారయ్యారు. ఈ ఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేతిబౌలి ఎక్స్‌రోడ్డులో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లో జ్యువెల్లరీ దుకాణం మూసివేసిన మేనేజర్ శ్రీకాంత్ శుక్రవారం అత్తాపూర్ వెళ్తూ మార్గమధ్యలో రేతిబౌలి ఎక్స్‌రోడ్డు వద్ద అర్ధరాత్రి పాన్ కొనేందుకు ఆగాడు. కార్మికుడితో కలిసి శ్రీకాంత్ పాన్ కొనుగోలు చేస్తుండగా పల్సర్ బైక్‌పై హెల్మెట్లు ధరించి వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు శ్రీకాంత్ చేతిలోని రూ.35 లక్షల బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యారు. వెంటనే శ్రీకాంత్ గుడిమల్కాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కోసమే జాబ్‌మేళా


జాబ్ మేళాలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకే మజ్లిస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. కార్వాన్‌లోని మెహబూబ్ ఫ్రైడ్ గార్డెన్‌లో జాబ్ మేళాను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 6425 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఇందులో 145 మంది అభ్యర్థులకు కంపెనీల వారు వెంటనే నియామకపు పత్రాలు ఇచ్చారన్నారు. మరో 1500 మంది మొదటి ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యారని రెండో ఇంటర్వ్యూ కోసం కంపెనీలకు రావాలని సూచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి


మారం జగదీశ్వర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నర్సయ్య

నాంపల్లి: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఎం.జగదీశ్వర్ పేర్కొన్నారు. తెలంగాణ పెన్షనర్ల కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాజుల నర్సయ్య, నవనీతరావు నేతృత్వంలో ప్రతినిధి బృందం శనివారం ఎం.జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సాధన కోసం ఉద్యోగ జేఏసీతో కలిసి పని చేస్తామని గాజుల నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉద్యోగ జేఏసీ నేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్, కోశాధికారి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు రఫీయొద్దీన్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు హెచ్.రాములు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి


పాఠశాల గోడపక్కనే చెత్తను చూపిస్తున్న నాగేశ్వర్

జియాగూడ: పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని జియాగూడ పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ నాగేశ్వర్, దివ్యాంగుల సంఘం దుర్గానగర్ నాయకుడు నరేశ్ కోరారు. జియాగూడ దుర్గానగర్ బస్తీలోని భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల పక్కనే 10 రోజుల క్రితం కొట్టేసిన చెట్ల కొమ్మలు, చెత్తాచెదారం పడి ఉండడంతో వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యర్థాలతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అయినా జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పనులు సత్వరమే పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్

యాకుత్‌పురా: అధికారులు సమన్వయంలో పని చేసి పనులను సత్వరమే పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. నియోజకవర్గంలోని తలబ్‌కట్టా, మురాద్ మహల్, వోల్గా హోటల్, ఖాజీసాబ్ కీ గల్లీ, జహంగీర్ నగర్, మహ్మదీయ మసీద్, జైన్ ఆటో గ్యారేజ్, మీర్‌జుమ్లా తదితర ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. సీవరేజ్ డ్రైనేజ్ పైపులైన్ పనులను మొఘల్‌పురా కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా, జీహెచ్ఎంసీ, జలమండలి, టీజీ ఎస్పీడీసీఎల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్, సీసీ రోడ్ల పనులు చేపట్టామన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హిందీనగర్‌లో ‘వినాయక ఆగమన్’ కార్యక్రమం


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

అబిడ్స్: హిందీ నగర్‌లో అభిమాన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ‘వినాయక ఆగమన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విశాల్, తరుణ్, నిఖిల్ ఆధ్వర్యంలో పూజలు చేసి వినాయకుడిని మండపానికి తీసుకువచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సతీశ్ కుమార్, ధన్‌రాజ్, కిట్టు యాదవ్ హాజరు కాగా వారిని సన్మానించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


ఎంపికైన విద్యార్థి నాయకులతో జీఎం గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని విద్యావేత్తలు జీఎం.గోపాల్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విజయనగర్‌కాలనీ నారాయణ ఈటెక్నో పాఠశాలలో కేబినెట్ సంస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపికైన అగ్ని, త్రిశూల్, నాగ్, పృథ్వీ టీం విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాజం, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ.నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ గంగాకిరణ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైనది


న్యాయవాదులను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: న్యాయవాద వృత్తి పవిత్రమైనదని ప్రముఖ హైకోర్టు న్యాయవాది మహ్మద్ ఆజామ్ అన్నారు. టూమ్స్ చౌరస్తాలో న్యాయవాది మీర్జా ఎక్బాల్ అహ్మద్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆజామ్ మాట్లాడుతూ చట్టాలపై గౌరవం, అపార నమ్మకం ఉన్న వారే న్యాయవాద వృత్తిలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జునైద్, మీర్జా ఎక్బాల్ అహ్మద్, మీర్జా జమీల్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

రేపు అంకుట్ మహాప్రసాద వితరణ

జియాగూడ: శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని జియాగూడ వేంకటేశ్వరనగర్ మాతా కమన్ వద్ద ఈ నెల 2న అంకుట్ మహాప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు వరాల మైసమ్మ టెంపుల్ ప్రతినిధి పోలరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రసాద వితరణ చేపడతామని బస్తీవాసులు తరలివచ్చి స్వీకరించాలని కోరారు.

ఖోఖో పోటీలు షురూ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాఘవరెడ్డి

గన్‌ఫౌండ్రీ : సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సీబీఎస్ఈ బాలికల జాతీయ ఖోఖో టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. తెలంగాణ ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు జె రాఘవరెడ్డి హాజరై మాట్లాడుతూ.. బాలికల కోసం క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ నెల 2 వరకు పోటీలు కొనసాగుతాయని 11 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు ఆనంద్‌కుమార్, సంస్థ కార్యదర్శి యూఏ.సుందరి, పాఠశాల ప్రిన్సిపాల్ యూ.తెరిస్సా తదితరులు పాల్గొన్నారు.

నేడు నార్మ్స్ 49న ఫౌండేషన్ డే

ఏజీవర్సిటీ: నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్స్) 49న ఫౌండేషన్ డే సెప్టెంబర్ 1న (నేడు) నిర్వహించనున్నట్లు నార్మ్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నార్మ్స్‌లోని స్వామినాథ్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరుగుతుందని కార్యక్రమానికి న్యూఢిల్లీ ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ ఆర్‌సీ అగ్రావాల్ అతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ ఈడీకి ఘన సన్మానం



సాక్షి,సిటీబ్యూరో: టీఎస్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు శనివారం పదవీ విరమణ చేశారు. దీంతో రాణిగంజ్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రతినిధులు హిదాయత్ అలీ, ఆరిఫ్, దుబ్బాక యాదయ్య, సుభాష్ తదితరులు పాల్గొన్నారు

వాటర్ బోర్డులో..



అబిడ్స్: వాటర్‌బోర్డు సీనియర్ జీఎం సునీల్‌కుమార్ డిప్యూటీ జీఎం శ్రీనివాస్, జేటీఓ దశరథ్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వాటర్‌బోర్డు ఫిల్టర్‌బెడ్స్‌లో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎ.ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో జీఎం మాట్లాడుతూ.. వాటర్‌బోర్డులో 30 ఏళ్లకు పైగా పని చేయడంసంతోషంగా ఉందన్నారు. జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ప్రజలకు చేసిన ఉత్తమ సేవలే గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో వాటర్‌బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ బుక్కులు, బ్యాగుల పంపిణీ


బ్యాగులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

యాకుత్‌పురా: మజ్లిస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ యాకుత్‌పురాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల విద్యార్థులకు శనివారం నోటు బుక్కులు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు పార్టీ తరఫున విద్యా సామాగ్రి అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.